# తుపాను హెచ్చరికలతో వర్రీ

- హడావుడిగా ధాన్యం అమ్మకాలు
- కోతలు వాయిదా వేయాలని అధికారుల సూచన
- ఖర్చులు కూడా గిట్టుబాటు కాక రైతుల వేదన


నూర్చిన ధాన్యాన్ని సంచులకు ఎత్తుతున్న కూలీలు

**తిరువూరు:** తిరువూరు డివిజన్లో ఈ ఖరీఫ్ సీజన్లో వరిపైరుకు ఆశించిన తెగుళ్లతో దిగుబడులు 25 శాతం తగ్గగా, వరి కోతలు ప్రారంభం నుంచి వాతావరణంలో మార్పులతో రైతులు త్వరగా ధాన్యాన్ని అమ్ముకోవాలనే తాపత్రయ పడుతున్నారు. ప్రభుత్వం అన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేసినట్లు చెబుతున్నా నిబంధనలు కఠినతరంగా ఉండటంతో ప్రైవేటు వ్యాపారుల వైపే మొగ్గు చూపుతున్నారు.

> ఖరీఫ్ వరి కోతలు చివరి దశకు చేరుకున్నాయి. ఈ తరుణంలో ఫెంగల్ తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ చేస్తున్న హెచ్చరికలతో రైతుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. వాతావరణం అనుకూలంగా లేనందున కోతలు వాయిదా వేసుకోవాలని, కళ్లాల్లో ధాన్యం తడవకుండా ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులు రైతులకు సూచిస్తున్నారు.

## లక్ష్యం ఘనం..కొనుగోలు స్వల్పం

తిరువూరు రెవెన్యూ డివిజన్‌లోని ఐదు మండలాల్లో 20,500 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణను ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించింది. స్థానికంగా ఉన్న ఆరు రైస్‌మిల్లులకు ధాన్యం తరలించేందుకు కూడా ఏర్పాట్లు చేసింది. మిల్లర్ల నుంచి బ్యాంకు గ్యారంటీ కూడా తీసుకున్నప్పటికీ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ అంతంతమాత్రంగానే ఉంది. 90 శాతం ధాన్యం ప్రైవేటు వ్యాపారులే కొనుగోలు చేయగా, నెల రోజుల తర్వాత సొమ్ము చెల్లించేందుకు ముందుగానే రైతులతో ఒప్పందం చేసుకున్నారు. గతంలో కూడా కొందరు ప్రైవేటు వ్యాపారులు, మిల్లర్లు రైతుల నుంచి తీసుకున్న ధాన్యానికి డబ్బు చెల్లించకుండా నెలల తరబడి తిప్పుకున్న ఘటనలు ఉండగా, పలువురు వ్యాపారులు తూకాల్లో తేడాతో రైతులను మోసం చేస్తున్నారు. 75 కిలోల బస్తాకు మూడు కిలోల తరుగు చూపడమే కాక మరో మూడు కిలోలు తూకంలో తేడా చేస్తుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. తిరువూరు ఆర్డీఓ, జిల్లా జాయింట్ కలెక్టర్లు డివిజన్‌లో పర్యటించి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని రైతులకు సూచిస్తున్నప్పటికీ ఫలితం లేకపోయింది.


## గోదాము సదుపాయం లేక ఇక్కట్లు

తిరువూరు డివిజన్‌లో గతంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదాముల్లో ధాన్యాన్ని నిల్వ చేసుకునే వెసులుబాటు ఉండేది. నిల్వ చేసిన ధాన్యానికి ఏఎంసీ ద్వారా రుణం తీసుకుని మూడు నెలల వరకు వడ్డీ లేకుండా చెల్లించే సదుపాయాన్ని కూడా కల్పించేవారు. ప్రస్తుతం ఈ సదుపాయం లేకపోవడంతో పాటు గోదాముల్లో ధాన్యాన్ని భద్రపరిచేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయని కారణంగా రైతులు తక్కువ ధరకైనా ధాన్యాన్ని ప్రైవేటు వ్యాపారులకు విక్రయిస్తున్నారు.

## ఖర్చులు ఎక్కువ.. రాబడి తక్కువ

ఈ సీజన్‌లో సాగు ఖర్చులకు అదనంగా తెగుళ్ల నివారణకు పలుమార్లు పురుగుమందులు పిచికారీ చేయడంతో సాగు వ్యయం తడిసి మోపెడైందని రైతులు వాపోతున్నారు. ఎకరా కలుపు తీతకు రూ.2 వేలు, కోతలకు రూ.4,500, మందు కట్టలకు రూ.3,500, ధాన్యాన్ని ఇంటికి తోలకానికి రూ.1,500 చొప్పున ఖర్చవుతోంది. ఎకరాకు 30 బస్తాల లోపు మాత్రమే దిగుబడి రావడం, ధాన్యం 78 కిలోల బస్తా రూ.1,420 మించి ధర రాకపోవడంతో పెట్టిన పెట్టుబడి కూడా గిట్టుబాటు కాలేదని రైతులు చెబుతున్నారు. కౌలు రైతుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఎకరాకు 10 బస్తాలు భూ యజమానికి కౌలు కింద ఇవ్వడంతో పాటు సాగు ఖర్చులు కలిపితే నష్టాల్లో మునిగిపోయామంటున్నారు.


వరి యంత్రంతో కోతలు




### కొనుగోలులో ఇబ్బందులుంటే తెలియజేయండి

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఏవైనా ఇబ్బందులు ఉంటే తెలియజేయవచ్చు. తిరువూరు తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు పర్యవేక్షణకు అధికారులను నియమించాం. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు గోనె సంచులు కావలసినన్ని అందుబాటులో ఉంచాం.

– లక్ష్మి, తహసీల్దారు, తిరువూరు

## క్లుప్తంగా

### ప్రత్యామ్నాయ పంటల సాగు మేలు



**ముసునూరు:** పొగాకు సాగు విస్తీర్ణాన్ని తగ్గించి, ప్రత్యామ్నాయ పంటలు విస్తారంగా పండించాలని నూజివీడు వ్యవసాయ సహాయ సంచాలకులు జి.విద్యాసాగర్ రైతులకు సూచించారు. మండల వ్యవసాయాధికారి సందీపాము మధుమోహన్ ఆధ్వర్యంలో ముసునూరు, గోపవరం, బలివే తదితర గ్రామాల్లో శుక్రవారం పొగాకుకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై శిక్షణ కార్యక్రమాలు, అవగాహన సదస్సులు నిర్వహించారు. హానికారక పొగాకు ఉత్పత్తులతో క్యాన్సర్ వంటి వ్యాధులు సంభవిస్తున్నాయన్నారు. పొగాకు పంటకు ప్రత్యామ్నాయ పంటల సాగు చేయాలని చెప్పారు. మొక్కజొన్న, పత్తి, వేరుశనగ, నువ్వులు, అపరాల సాగు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమాల్లో వీహెచ్‌ఏలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

### ఎంఎస్‌ఎంఈ పథకంపై అవగాహన

**ఇబ్రహీంపట్నం:** ఎంఎస్‌ఎంఈ ట్రైనింగ్ ప్లాగ్ షిప్ పథకం సర్వేపై అవగాహన సదస్సు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఎంపీడీఓ సునీతశర్మ మాట్లాడుతూ ఎంఎస్‌ఎంఈ ట్రైనింగ్ ప్లాగ్ షిప్ పథకంపై గ్రామీణ ప్రాంత నిరుద్యోగులకు అవగాహన కల్పించాలన్నారు. సర్వేలో పూర్తి వివరాలతో పేర్లు నమోదు చేసుకోవడం ద్వారా బ్యాంక్ రుణాలు పొంది పరిశ్రమలు ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. సర్వేలో పొందుపర్చిన అంశాలను బట్టి ప్రభుత్వ రాయితీలు, బ్యాంక్ రుణాలు పొందవచ్చన్నారు. సర్వే ప్రత్యేకాధికారి టి.సత్యనారాయణ సర్వే యాప్‌లో నమోదు చేయాల్సిన అంశాలను వివరించారు. రిజిస్ట్రేషన్ల విధానాన్ని వివరించారు. ఈఓపీఆర్డీ మనోజ్ కుమార్, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

### వరి కోతలు వాయిదా వేసుకోవాలి

ఏఓ రాజ్యలక్ష్మి



**విస్సన్నపేట:** తుపాను హెచ్చరికల నేపథ్యంలో రైతులు వరి కోతలను వాయిదా వేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రాజ్యలక్ష్మి అన్నారు. విస్సన్నపేటలోని కళ్లాల్లో ఆరబెట్టిన ధాన్యాన్ని ఏఓ శుక్రవారం పరిశీలించి మాట్లాడారు. రైతులు అప్రమత్తంగా ఉండాలని, పట్టాలతో కప్పుకొని ధాన్యాన్ని భద్రపరుచుకోవాలని సూచించారు. ఆరబెట్టిన ధాన్యాన్ని త్వరితగతిన కొనుగోలు కేంద్రాలకు తరలించి విక్రయించుకోవాలన్నారు. మండలంలో రైతు సేవా కేంద్రాల వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 2,546 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని చెప్పారు.

### రైతులు అప్రమత్తంగా ఉండాలి

తిరువూరు తహసీల్దార్ లక్ష్మి

**తిరువూరు:** తుపాను ప్రభావంతో వర్షాలు పడే అవకాశం ఉన్నందున వరికోతలను రైతులు వాయిదా వేసుకోవాలని తిరువూరు తహసీల్దార్ లక్ష్మి సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ఇప్పటికే కోసిన ధాన్యాన్ని తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దగ్గరలో ఉన్న కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తరలించాలని, ఇందుకు అవసరమైన ఖాళీ గోనె సంచులు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎటువంటి ఇబ్బంది కలిగినా తెలియజేయాలని, ఇందుకు అవసరమైన సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. తిరువూరు మండల వ్యవసాయాధికారి పద్మ పాల్గొన్నారు.

### హుండీ కానుకల ఆదాయం రూ. 3.70 లక్షలు



**మేడూరు(గంపలగూడెం):** మేడూరు వీరాంజనేయస్వామి దేవస్థానంలో భక్తులు హుండీల ద్వారా స్వామివారికి సమర్పించిన కానుకలను శుక్రవారం లెక్కించారు. గడచిన మూడు నెలలకు గాను రూ. 3,70,210 ఆదాయం లభించిందని మేనేజర్ వీడీడీ ప్రసాద్ తెలిపారు. గన్నవరం ఇన్‌స్పెక్టర్ కేవీ అనురాధ పర్యవేక్షణలో సిబ్బంది, గంపలగూడెంకు చెందిన పలువురు మహిళలు పాల్గొన్నారు.

## ● ఆత్మీయ కలయిక




మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ సమన్వయకర్త జోగి రమేష్ ఆధ్వర్యంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ గరికపాటి శ్రీదేవి, వైస్ ఎంపీపీ బాణావత్ నాగబాలమ్మ శుక్రవారం కలిశారు. గ్రామాల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారికి సూచించారు. మండల కో-ఆప్షన్ సభ్యుడు పఠాన్‌నాగులు పాల్గొన్నారు.

–ఇబ్రహీంపట్నం

# కనులవిందుగా దీపోత్సవం


గంపలగూడెం శివాలయంలో అర్ధనారీశ్వరుని ఆకారంలో దీపోత్సవం


గంపలగూడెం శివాలయంలో శివలింగాకారంలో దీపోత్సవం

**గంపలగూడెం:** గంపలగూడెం గంగా భ్రమరాంబ బాల త్రిపుర సుందరి దేవి సమేత చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో కార్తికమాసం సందర్భంగా శుక్రవారం రాత్రి కనుల విందుగా దీపోత్సవం జరిగింది. అర్ధనారీశ్వరుడు, డమరుకం, కలశం, పద్మం, శివలింగం ఆకారాల్లో ప్రమిదల ఉంచి వెలిగించారు. తొలుత ఆలయ అర్చకులు బాదంపూడి శివరామలింగప్రసాద్ పరమేశ్వరునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దీప కాంతులతో ఆలయం మిరమిట్లు గొలిపింది.

● **మైలవరం:** వెల్వడం గ్రామంలోని బాలకోటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో కార్తిక మాసం సందర్భంగా ఏర్పాటు చేసిన కోటి దీపోత్సవం శుక్రవారం కనుల పండువగా జరిగింది. స్థానిక ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ హాజరై స్వామి వారికి పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు, భక్తులు హాజరై పూజలు నిర్వహించారు.

● **ఆగిరిపల్లి:** కార్తిక మాసం సందర్భంగా స్థానిక గంగా అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర ఆలయంలో స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయ ప్రాంగణంలో పది వేల దీపాలతో దీపోత్సవం నిర్వహించారు.


ఆగిరిపల్లిలో దీపోత్సవం

### 10 శాతం సీఎల్ మంజూరు విధానం తగదు

**చాట్రాయి:** ప్రభుత్వ ఉపాధ్యాయులను ఆందోళనకు గురిచేస్తున్న 10 శాతం సీఎల్ (క్యాజువల్ లీవ్స్) మంజూరు విధానాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఎస్టీయూ జిల్లా ఆర్థిక కార్యదర్శి జి.రాము అన్నారు. శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎఫ్ఎల్ఎన్ రెసిడెన్షియల్ శిక్షణ కార్యక్రమం రద్దు చేయాలని, అపార్ నమోదు విషయంలో ఉపాధ్యాయులపై ఒత్తిడి తొలగించాలని కోరారు. సమావేశంలో ఆ శాఖ మండల మైనార్టీ కన్వీనర్ మహబూబ్, కార్యదర్శి జి. అమరయ్య పాల్గొన్నారు.

### వృత్తి విద్యా కోర్సులపై ఆసక్తి

**జూపూడి(ఇబ్రహీంపట్నం):** సర్వశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృత్తి విద్యా కోర్సులు విద్యార్థుల్లో ఆసక్తి పెంచుతున్నాయని మూలపాడు జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.డేవిడ్ రాక్‌ఫెల్లర్ అన్నారు. శిక్షణలో భాగంగా 9, 10, ఇంటర్ మీడియెట్ బాలబాలికలు జూపూడి నిమ్రా ఇంజినీరింగ్ కళాశాలను శుక్రవారం సందర్శించారు. కళాశాలలో ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ పరికరాల పని తీరు, నేటి సమాజానికి వాటి అవసరతపై అవగాహన కల్పించారు. భవిష్యత్‌లో ఇంజినీరింగ్ విద్య, సామాజిక ఆవిష్కరణలపై అవగాహన పెంచుకోవాలని చెప్పారు. ఒకేషనల్ కోర్స్ ట్రైనర్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణా జలాలు సరఫరా చేయాలి

**కలెక్టర్‌కు కుదప గ్రామస్తుల వినతి**

**మైలవరం:** కృష్ణా జలాలు సరఫరా చేయాలని కుదప గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం కుదప గ్రామాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ లక్ష్మీశాకు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ మైలవరం మండలం తోలుకోడు గ్రామం నుంచి కుదప గ్రామానికి కృష్ణా జలాలు వచ్చి ఇక్కడ సంపు నిర్మాణం చేపట్టినా పూర్తిస్థాయిలో తాగునీటిని గ్రామంలో సరఫరా చేయడం లేదని చెప్పారు. గ్రామంలోని బోరుల్లో ఫ్లోరైడ్ అధికంగా ఉండటంతో ప్రజల కాళ్ళు, చేతులు వంకర్లు పోతున్నాయని, ప్రజలు కిడ్నీ వ్యాధి బారిన పడుతున్నారని చెప్పారు. ఈ విషయం స్థానిక ఎమ్మెల్యే దృష్టిలో ఉందని, తాను అన్ని విధాలుగా సహకరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారని, అధికార యంత్రాంగం కూడా ఈ విషయంలో జోక్యం చేసుకుని సహకరించాలని కలెక్టర్‌ను గ్రామస్తులు కోరారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ గ్రామానికి కృష్ణా జలాలు సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


కుదప గ్రామంలో కలెక్టర్ లక్ష్మీశాకు సమస్యలు విన్నవిస్తున్న గ్రామస్తులు

# వైభవంగా లక్ష బిల్వార్చన

**ముసునూరు:** బలివే మహా క్షేత్రంలో బలే రామలింగేశ్వరస్వామికి శుక్రవారం రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన నిర్వహించారు. కార్తిక మాసం, మాస శివరాత్రి కావడంతో శివాలయాలకు భక్తులు పోటెత్తారు. బలివేలోని రామలింగేశ్వరస్వామికి ఏలూరు వర్తక సంఘ ప్రతినిధులు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన, రుద్ర హోమం, జ్యోతిర్లింగార్చన చేశారు. మహిళలు దేవస్థాన ప్రాంగణంలో కార్తిక దీపాలు వెలిగించారు. ఆలయ ఈఓ పామర్తి సీతారామయ్య ఏర్పాట్లు పర్యవేక్షించారు.

● **విస్సన్నపేట:** స్థానిక గంగా పార్వతి సమేత చంద్రశేఖరస్వామి దేవస్థానం (శివాలయంలో) శుక్రవారం లక్ష బిల్వార్చన నిర్వహించారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ వెంపటి శ్రీకృష్ణజనార్దనరావు పర్యవేక్షించారు.

● **తిరువూరు:** స్థానిక చంద్రమౌళీశ్వరాలయంలో కార్తిక మాసం సందర్భంగా శుక్రవారం మహా రుద్రాభిషేకం నిర్వహించారు. శివ సేవా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన రుద్రాభిషేకంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


స్వామి వారికి లక్ష బిల్వార్చన నిర్వహిస్తున్న అర్చకులు


తిరువూరులో రుద్రాభిషేకం చేస్తున్న పండితులు

### గ్రామాలలో ఇంటింటికీ వైద్య సేవలు

**మైలవరం:** గ్రామాలలో ఇంటింటికీ తిరిగి గ్రామస్తుల ఆరోగ్య సమస్యలు సేకరించి ఉన్నతాధికారులకు ఆన్‌లైన్ ద్వారా సమాచారం అందజేస్తున్నామని వైద్యాధికారి డాక్టర్ ప్రసన్నరాణి శుక్రవారం తెలిపారు. జి.కొండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని హెచ్.ముత్యాలంపాడు గ్రామంలో డాక్టర్ ప్రసన్నరాణి, జిల్లా క్వాలిటీ కో-ఆర్డినేటర్ డి. షీబా ఆధ్వర్యంలో నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్ ఆన్‌లైన్ ద్వారా శుక్రవారం కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో ఆరోగ్య కార్యకర్తలు నిర్వహిస్తున్న కార్యక్రమాలు, గ్రామస్తులకు అందిస్తున్న సేవలను అధికారులకు ఆన్‌లైన్‌లో వివరించారు. సీహెచ్‌ఓ కె.అచ్చయ్య, ఆశా నోడల్ ఆఫీసర్ ఎం.దుర్గారాణి, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

### చికిత్స పొందుతూ మహిళ మృతి

**దుందిరాలపాడు(గంపలగూడెం):** పొలంలో పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళ చికిత్స పొందుతూ మృతిచెందింది. ఎస్‌ఐ వి.శ్రీను తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రామకంటి రామకృష్ణ భార్య రామకంటి పుష్ప(37)కు 18 ఏళ్ల కిందట వివాహమైంది. ఇద్దరు సంతానం. ఈనెల 23వ తేదీన పొలం పనికి వెళ్లిన పుష్ప పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబీకులు ఆమెను చికిత్స నిమిత్తం విజయవాడ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ఆమె పరిస్థితి విషమించడంతో శుక్రవారం మృతి చెందింది.

### నిబంధనలు సడలించాలని టీచర్ల డిమాండ్

**కంచికచర్ల:** ఉపాధ్యాయుల వ్యక్తిగత సెలవుల మంజూరులో విధించిన ఆంక్షలను ప్రభుత్వం సడలించాలని పీఆర్టీయూ పత్రిక ప్రధాన సంపాదకుడు గడ్డం నారాయణరావు డిమాండ్ చేశారు. పెండ్యాల, కీసర, గండేపల్లి తదితర ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం పీఆర్టీయూ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ మండల యూనిట్‌గా 10 శాతం మించి సెలవులు మంజూరు చేయరాదనే నిబంధన తెచ్చేందుకు రాష్ట్ర స్థాయి అధికారులు ప్రయత్నిస్తున్నారని, ఇది సరైన విధానం కాదన్నారు. సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ నవాబ్ జానీ, కోసూరి రాజశేఖర్ మాట్లాడుతూ ఇప్పటికే ప్రభుత్వం వివిధ రకాలైన యాప్‌ల భారం మోపి ఉపాధ్యాయులను ఉక్కిరిబిక్కిరి చేస్తోందన్నారు. ప్రభుత్వం ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన డీఏ బకాయిలు, ఏపీ జీఎల్ఐ, పీఎఫ్ తదితర బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 12వ పీఆర్సీ కమిటీ నియమించేంత వరకు తక్షణమే 30శాతం ఐఆర్ ప్రకటించాలని కోరారు. సంఘ నాయకులు వేముల క్రిష్టాఫర్, దబ్బూరి సాంబశివరావు, కొనకళ్ల రమేష్ పాల్గొన్నారు.

### సీసీ కెమేరాల ఏర్పాటుకు సహకరించండి

డీఎస్పీ కేవీవీఎన్‌వీ ప్రసాద్


సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ కేవీవీఎన్‌వీ ప్రసాద్

**నూజివీడు:** పట్టణంలో నేరాలు చోటుచేసుకున్నప్పుడు సులువుగా ఛేదించేందుకు సీసీ కెమేరాలు ఎంతగానో ఉపయోగపడతాయని, ఈ నేపథ్యంలో వ్యాపారులు తమ షాపులతో పాటు షాపు బయట వైపు కూడా సీసీ కెమేరాలను ఏర్పాటు చేయాలని నూజివీడు డీఎస్పీ కేవీవీఎన్‌వీ ప్రసాద్ పేర్కొన్నారు. పట్టణంలోని వ్యాపార సంఘాల నాయకులతో స్థానిక పైడి అప్పారావు మర్చంట్స్ హాల్‌లో శుక్రవారం సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ ఇటీవల నగదు కాజేయడం, చైన్ స్నాచింగ్, దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయని చెప్పారు. సీసీ కెమేరాలు ఉంటే దొంగలను సులువుగా గుర్తించి పట్టుకోవచ్చన్నారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లలో సీసీ కెమేరాల ఏర్పాటుకు వ్యాపారస్తులందరూ సహకరించాలని కోరారు. దొంగతనాలు జరుగుతున్నందున పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇళ్లకు తాళాలు వేసి ఊరు వెళ్తుంటే సమాచారాన్ని పోలీస్‌స్టేషన్‌లో తెలియజేయాలన్నారు. సమావేశంలో సీఐ పి. సత్య శ్రీనివాస్, ఎస్‌ఐ జి.జ్యోతిబసు, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు పగడాల సత్యనారాయణ, పెనుగొండ రామారావు, వ్యాపార సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

### మాదక ద్రవ్యాల నిర్మూలన అందరి బాధ్యత

**ఆగిరిపల్లి:** మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నవజీవన్ బాల భవన్ ప్రోగ్రాం మేనేజర్ గొల్లమూడి శేఖర్‌బాబు అన్నారు. శుక్రవారం ఈదర అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్తలకు మాదక ద్రవ్యాలు, సోషల్ మీడియా దుర్వినియోగం ద్వారా కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు కోసం మాదక ద్రవ్యాల నియంత్రణ ఎంతో ముఖ్యమన్నారు. యువత ఉజ్వల భవిష్యత్‌ను నాశనం చేసే మత్తు పదార్థాల వినియోగాన్ని పూర్తిగా రూపుమాపేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాగమయి, నీ తోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కో-ఆర్డినేటర్ వెంకటేశ్వరరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

### నేడు నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం

**తిరువూరు:** తిరువూరు నగర పంచాయతీ కౌన్సిల్ సాధారణ సమావేశం శనివారం జరుగుతుందని కమిషనర్ లోవరాజు తెలిపారు. ఉదయం 11 గంటలకు చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి అధ్యక్షతన జరుగనున్న సమావేశంలో కౌన్సిలర్లు అజెండాలో పేర్కొన్న అంశాలపై చర్చించి తీర్మానిస్తారని చెప్పారు.

### నేడు నూజివీడు మున్సిపల్ కౌన్సిల్

**నూజివీడు:** నూజివీడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శనివారం నిర్వహిస్తామని కమిషనర్ ఆర్. వెంకటరామిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ అధ్యక్షతన నిర్వహించనున్న కౌన్సిల్ సమావేశానికి కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, సంబంధిత అధికారులు హాజరుకావాలని కోరారు.